ఏజెన్సీ గ్రామంలో మద్యపాన నిషేధం

నల్లబెల్లి, సెప్టెంబర్ 21: వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలానికి సరిహద్దులో ఉన్న ఏజెన్సీ గ్రామం గొల్లపల్లె సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసి ఆదర్శంగా నిలిచింది. గ్రామంలో 750 మంది జనాభా ఉండగా.. చాలా మంది యువత గుడుంబా, మద్యానికి బానిసై యుక్తవయస్సులోనే మృత్యువాత పడ్డా రు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. మరికొందరు గుడుంబాకు బానిసై కష్టపడి సంపాదించిదంతా తాగుడుకే ఖర్చు చేస్తున్నారు. కుటుంబాలను పట్టించుకోలేదు. దీంతో విసిగిపోయిన గ్రామప్రజలు.. గ్రామం బాగుపడాలంటే మద్యపాన నిషేధమొక్కటే మార్గమని నిర్ణయించుకున్నారు.

ఫార్మాసిటీని రద్దు చేయాలి

- మా భూములను వాపసు ఇవ్వాలి
- నాలుగు గ్రామాల రైతులు డిమాండ్
- సోనియా, రాహుల్‌కు లేఖలు

యాచారం, సెప్టెంబర్ 21: యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించిన ఫార్మాసిటీని వెంటనే రద్దు చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖలు రాస్తున్నారు. ఇప్పటికే నానక్‌నగర్ గ్రామానికి చెందిన 200 మంది రైతులు లేఖలు రాసిన విషయం తెలిసిందే. ఫార్మాసిటీ వద్దంటూ తాజాగా శనివారం కుర్మిద్ద గ్రామానికి చెందిన కొంత మంది రైతులు పోస్టుకార్డులతో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖలు రాశారు. కాలుష్యాన్ని వెదజల్లే ఫార్మాసిటీని రద్దుచేయాలని, తమ నుంచి సేకరించిన భూములను తిరిగి ఇవ్వాలని ఆ లేఖల్లో డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని రద్దు చేస్తామని గతంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మార్చడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్నికలకు ముందు ఓట్ల కోసం రైతులతో కలిసి పాదయాత్ర చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్సీలు కోదండరామ్, తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తదితరులు ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పదవులను చేపట్టగానే ఫార్మా బాధిత రైతులను మర్చిపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యూచర్‌సిటీ అంటున్నారే తప్ప ఫార్మాసిటీని రద్దు చేసినట్టు ఎక్కడా జీవో చూపించడం లేదని మండిపడుతున్నారు. పైగా ఫార్మాసిటీని నిర్మించి తీరుతామని హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని ఇప్పటికైనా ఫార్మాసిటీని రద్దు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. లేకుంటే ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలను ఉద్ధృతం చేస్తామని, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులను తమ గ్రామాల్లో తిరుగనివ్వబోమని హెచ్చరించారు.

ఫార్మాసిటీ వద్దంటూ రాసిన ఉత్తరాన్ని చూపుతున్న తాటిపర్తి గ్రామ మహిళ

ముల్కనూరు ప్రజాగ్రంథాలయం

ప్రజాగ్రంథాలయంలో నేడు దశాబ్ది ఉత్సవాలు

- 2023 కథల పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ
- 'నమస్తే తెలంగాణ-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' నిర్వహణ

హనుమకొండ సబర్బన్, భీమదేవరపల్లి, సెప్టెంబర్ 21: ముల్కనూరు ప్రజాగ్రంథాలయం దశాబ్ది ఉత్సవాలకు సిద్ధమైంది. 'నమస్తే తెలంగాణ' దినపత్రిక-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం సంయుక్తంగా ఏటా కథల పోటీలు నిర్వహిస్తున్నది. ఇదే తరహాలో నిర్వహించిన 'కథల పోటీలు-2023' విజేతల ఎంపిక ప్రక్రియ పూర్తికాగా.. ఆదివారం దశాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇదే వేదికపైనే విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో 2014లో ఆ గ్రామ పూర్వ విద్యార్థులు ప్రజాగ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. అంచెలంచెలుగా ఎదిగి ముల్కనూరు ప్రజాగ్రంథాలయంగా రూపుదిద్దుకొన్నది. నిత్యం వందలాది మందితో కిటకిటలాడే ఈ గ్రంథాలయం ఇప్పుడు దశాబ్ది ఉత్సవాలకు ముస్తాబైంది. ముఖ్య అతిథులుగా రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీ కాంతారావు, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, తెలుగు కవి అందెశ్రీ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, హనుమకొండ జడ్పీ మాజీ చైర్మన్ మారపల్లి సుధీర్‌కుమార్, నమస్తే తెలంగాణ దినపత్రిక ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తి హాజరుకానున్నట్టు నిర్వాహకులు సీఎంవో ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ వంగ రవి తెలిపారు.

ఎల్లంపల్లిని పూర్తి చేసిందెవరు?

- కాంగ్రెస్ ప్రాజెక్టు పూర్తి చేస్తే నీళ్లెందుకు నింపలే?
- మంత్రి పొన్నం వ్యాఖ్యలపై నెటిజన్ల విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ): 'కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అవి కాళేశ్వరం జలాలు కావు' అని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణవాదుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి గప్పాలు తప్ప మరేమీలేదని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. వాస్తవంగా ఎల్లంపల్లి ప్రాజెక్టును తా మే నిర్మించామని కాంగ్రెస్ సర్కారు చెప్తున్న గొప్పలన్నీ కూడా ఒట్టి మాటలే. ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేసినా దానిని వినియోగంలోకి తీసుకురాలేదన్నది అంతే వాస్తవం. జలయజ్ఞంలో భాగంగా 2004లో రూ.3,177 కోట్ల తో 20.16టీఎంసీల నీటి నిల్వసామర్థ్యంతో ఎల్లంపల్లి ప్రాజెక్టును చేపట్టారు. తెలంగాణ వచ్చేనాటికి ప్రాజెక్టుపై రూ.3,347.27 కోట్లు ఖర్చుపెట్టారు. తెలంగాణ ఏర్పడేనాటికి ఏనా డూ ఆ రిజర్వాయర్‌లో 5 టీఎంసీలకు మించి జలాలను నిల్వ చేయలేదు. కారణం భూసేకరణ పూర్తి చేయకపోవటం, ముంపు బాధితులకు పునరావాసం కల్పించకపోవడమే. ప్రాజెక్టు కోసం మొత్తంగా 27,387ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, 18,778 ఎకరాలను మాత్రమే సేకరించింది. ఇక పునరావాసం కల్పనకు 13,296 ఇండ్లను నిర్మించాల్సి ఉండగా, 1,448 ఇండ్లను మాత్రమే పూర్తిచేసింది. అదీగాక ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటినిల్వ వల్ల లక్షెటిపేట బ్రిడ్జి మునిగిపోయి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మరో రూ.2,052.73 కోట్లను వాటి కోసం వెచ్చించింది. బరాజ్‌ను 2016లో పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చింది. ఇదీ వాస్తవం. కానీ అందుకు విరుద్ధంగా ప్రాజెక్టు మొత్తం పూర్తిచేశామని మంత్రి పొన్నం వ్యాఖ్యానించడంపై తెలంగాణవాదులు విమర్శలు గుప్పిస్తున్నారు. అదీగాక ఎల్లంపల్లి నుంచే నీళ్లను తరలించామని చెబుతున్న మంత్రి పొన్నం వాటిని ఏవిధంగా తరలించారో కూడా చెబితే బాగుండేదని చురకలంటిస్తున్నారు. మంత్రి పొన్నం వ్యాఖ్యలు ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని తెలంగాణవాదులు వివరిస్తున్నారు. అం తేకాదు అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు రూపకల్పన చేసిన ప్రాజెక్ట్‌లోనే ఎల్లంపల్లి, నందిమేడారం, లక్ష్మీబరాజ్, మిడ్‌మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ భాగమై ఉన్నాయని అంగీకరించిన పొన్నం మరి ఆ యా రిజర్వాయర్లను నాడు ఎందుకు పూర్తి చేయలేదో కూడా చెబితే బాగుండేదని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా కేసీఆర్ రీడిజైన్ ఫలితంగానే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో 14టీఎంసీలుగా నీటి నిల్వ సామర్థ్యం ఏకంగా 141టీఎంసీలకు పెరిగిందని తెలంగాణవాదులు గుర్తుచేస్తున్నారు.

ఎల్లంపల్లి నుంచే నీళ్లు ఎత్తిపోశాం: పొన్నం

హైదరాబాద్, సెప్టెంబర్21 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి పూర్తయిందని, ఆ ప్రాజెక్టు నుంచే ప్రస్తుతం మల్లన్నసాగర్ వరకు రిజర్వాయర్లన్నీ నింపామని, అయినా కాళేశ్వరం జలాలు అంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు తప్పుదోవ పట్టిస్తున్నారని బీసీ సంక్షేమశాఖ మం త్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులోనే రూపకల్పనలోనే ఎల్లంపల్లి , నందిమేడారం, లక్ష్మీబరాజ్, మిడ్‌మానేర్, అనంతగిరి రిజర్వాయర్, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగ ర్ భాగమై ఉన్నాయని చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొన్నం మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ఎల్లంపల్లి ప్రాజెక్టు పూర్తయిందని తెలిపారు. కేసీఆర్ చేసిన రీడిజైన్ నిరుపయోగమని, మిడ్‌మానేరు, లోయర్ మానేరు, కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్‌కు వచ్చే నీరు ఎల్లంపల్లి నుంచి తీసుకున్నవి మాత్రమేనని, విడతల వారీగా వర్షాలు కురవడం వల్లే అది సాధ్యమైందని తెలిపారు. ఆగిన పనులు పూర్తి చేసినంత మాత్రాన ప్రాజెక్టు రూపొందించినట్టవుతుందా? అని ప్రశ్నించారు.

ఫార్మాసిటీ అక్కడే ఉంటుందా..లేదా?

➤ మొదటిపేజీ తరువాయి...

ఇవ్వడంలేదని తప్పుపట్టారు. ఫార్మాసిటీ భూములకు సంబంధించిన పిటిషన్లపై సోమవారం విచారణ చేపడతామని, ఆ లోగా ప్రభుత్వ నిర్ణయంతోపాటు ఫార్మాసిటీకి సంబంధించిన అన్ని వివరాలను తెలియజేయాల్సిందని తేల్చిచెప్పారు. కాగా, ఫార్మాసిటీ యథాతథంగా కొనసాగుతుందంటూ హైకోర్టులో ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. ఫార్మాసిటీ రద్దయినట్టు కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఆ అఫిడవిట్‌లో పేర్కొంటూ.. 2016 లో జారీ చేసిన జీవో 31 ప్రకారం ఫార్మాసిటీ యథావిధిగా కొనసాగుతుందని వెల్లడించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు కోసం మేడిపల్లిలో 1,700 ఎకరాల సేకరణకు భూసేకరణ చట్టంలోని సెక్షన్ 11(1) కింద గతంలో ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడిందని గుర్తుచేశారు. అంతకుముందు ఇదే ఫార్మాసిటీ ఏర్పాటు కోసం 2016లో ప్రభుత్వం జీవో 31ను జారీ చేసిందని, అంతేకాకుండా భూసేకరణ చట్టం కింద కొన్ని మినహాయింపులు ఇస్తూ జీవో 46ను జారీ చేసిందని తెలిపారు. డిక్లరేషన్, పరిహారం అవార్డు నిబంధనల ప్రకారం జరగలేదన్న ఆరోపణలు అవాస్తవమని, భూసేకరణ చట్టంలోని నిబంధనల ప్రకారమే అక్కడ భూసేకరణ చేపట్టామని పేర్కొన్నారు. ప్రభుత్వం సేకరించిన భూముల్లో పిటిషనర్‌కు సంబంధించిన 10 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. డిక్లరేషన్ అవార్డుపై పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించారని, విచారణ జరిపిన హైకోర్టు.. అభ్యంతరాల స్వీకరణ సహా భూసేకరణ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించిందని వివరించారు. ఈ ఆదేశాల ప్రకారం భూసేకరణకు సంబంధించిన ప్రాథమిక నోటిఫికేషన్ అమల్లోనే ఉన్నదని, ఈ నేపథ్యంలో సదరు భూములపై ధరణి పోర్టల్‌లో లావాదేవీలకు అనుమతించాలన్న పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పిటిషనర్ తన భూములపై ధరణి పోర్టల్ ద్వారా ఎలాంటి లావాదేవీలు నిర్వహించలేరని పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియ అమల్లో ఉన్నందున ధరణిలో ఎంట్రీల కోసం పిటిషనర్ చేసుకున్న దరఖాస్తును అనుమతించలేమని స్పష్టం చేశారు. అంతేకాకుండా అవార్డు నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై అప్పీళ్లు దాఖలు చేశామని, అవి ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. భూసేకరణ నిమిత్తం రెండు పత్రికల్లో నోటిఫికేషన్‌ను ప్రచురించామని, గ్రామసభ నిర్వహించి నోటీసులు జారీచేయడంతోపాటు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఏర్పాటు ఆవశ్యకతను అందరికీ వివరించామని చెప్పారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములకు ఎకరాకు రూ.12.50 లక్షల చొప్పున్న పరిహారం ఇవ్వాలని తొలుత నిర్ణయించినప్పటికీ ఆ తర్వాత దాన్ని రూ.16 లక్షలకు పెంచామని, దానికి అదనంగా రైతులకు 121 చదరపు గజాల చొప్పున స్థలాలను కూడా కేటాయిస్తున్నామని వివరించారు. నోటీసులకు సమాధానం ఇవ్వనందున అధికారులు జారీ చేసిన పరిహారం మొత్తాన్ని భూసేకరణ అథారిటీ వద్ద డిపాజిట్ చేశామని తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విధుల బహిష్కరణ

నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో వనపర్తి జిల్లా కొత్తకోట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, వాచ్‌మెన్, ప్లాంబర్ కం ఎలక్ట్రీషన్, గెస్టు ఫ్యాకల్టీ ఉద్యోగులు శనివారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సమస్య రాలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలు త్వరగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. -కొత్తకోట

హాజరైన విద్యార్థినులు

ఉద్యోగావకాశాలు కల్పిస్తాం

- అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి
- అట్టహాసంగా అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలలో స్వాగతోత్సవం

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 21 : డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో దరఖాస్తు చేసుకుంటే అవకాశం ఉన్నంత వరకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్వాగతోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఒక నిర్ణీత లక్ష్యంతో చదివి, మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఉద్యోగం చేయాలనే ఆలోచన ఉంటేనే చదివే ఆసక్తి ఉంటుందని చెప్పారు. రానున్న పట్టభద్రుల ఎన్నిక దృష్ట్యా ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటు నమోదు చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. అనంతరం డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, కళాశాల విద్యార్థులు పట్టభద్రుల ఓటు నమోదులో భాగస్వాము లవ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, నరేందర్‌రెడ్డికి ఖడ్గం అందించి, గజమాలతో సత్కరించారు.

నరేందర్ రెడ్డిని సత్కరిస్తున్న అల్ఫోర్స్ డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి

పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కొత్తపల్లి, సెప్టెంబర్ 21 : హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 19 నుంచి 20 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కరీంనగర్ జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. అండర్-20 విభాగంలో 3000 మీటర్ల పరుగు పందెంలో ఎం వినయ్ గోల్డ్ మెడల్ సాధించగా, 5000 మీటర్ల పరుగు పందెంలో సంతోష్ గోల్డ్, 3000 మీటర్ల పరుగు పందెంలో స్టీఫెన్ బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నారు. అలాగే, 10000 మీటర్ల రేస్ వాక్‌లో విష్ణువర్ధన్ గోల్డ్ మెడల్, డిస్కస్ త్రోలో స్వామి జావలిగోల్డ్, షాట్‌పుట్‌లో విక్రమ్ కుమార్ బ్రాంజ్ మోడల్ సాధించి ఓవరాల్‌గా రాష్ట్ర చాంపియన్‌షిప్‌ను సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్‌లను జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు.

23న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

కొత్తపల్లి, సెప్టెంబర్ 21 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలను ఈ నెల 23న నిర్వహించనున్నట్లు కరీంనగర్ డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) అధ్యక్ష, కార్యదర్శులు వీ ఆగంరావు, ఎన్ మురళీధర్‌రావు శనివారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు 2005 సెప్టెంబర్ 1 తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. క్రికెట్ యూనిఫాం, సొంత కిట్, పుట్టిన తేదీ ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, రెండు ఫొటోలతో ఉదయం 8 గంటలకు కేడీసీఏ మైదానంలో హాజరుకావాలని సూచించారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

చొప్పదండి, సెప్టెంబర్ 21 : స్థానిక నవోదయ విద్యార్థులు నవోదయ విద్యాలయ సమితి న్యూఢిల్లీ తరపున స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(హ్యాండ్ బాల్ పోటీల)కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. ఎనిమిది మంది విద్యార్థులు వివిధ జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనగా వీరిలో ముగ్గురు పల్లవి, శశాంక్, మణిచరణ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన పీఈటీ రాధికతో పాటు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తాం

శంకరపట్నం, సెప్టెంబర్ 21: పట్టబద్రుల ఎమ్మెల్సీగా అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని మండలంలోని వీఎన్ఆర్ యూత్ ఫోర్స్ సభ్యులు ప్రకటించారు. శనివారం కాచాపూర్, కల్వల, రాజాపూర్ గ్రామాలలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన యువకులు కొత్త ఓటరుగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు మారముల్ల శ్రీనివాస్, కనుకుంట్ల హరికృష్ణ, రెడ్డి రమేశ్, దాసారపు మహేందర్, సిరిపెల్లి ప్రశాంత్, ముద్దం రాకేశ్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్ 21 : మండలంలోని సింగాపూర్‌లో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఐసీటీసీ, సాహితీ ఫౌండేషన్ ఎన్జీవో, కిట్స్ కళాశాలల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ దవాఖాన సైక్రియాట్రిస్ట్ ఆస్తియా కుల్సం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్‌ను దూరం పెట్టాలని సూచించారు. కొంచమే కదా.. ఏమీ కాదని స్నేహితుల ప్రోద్బలంతో వాడకం మొదలైతే వ్యసనంలా మారే వరకు వెళ్తుందని, జీవితంలో సంతోషం, జ్ఞానం కోల్పోతారని, నేర పూరిత ప్రవర్తన అలవడుతుందన్నారు. ఇక్కడ కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ శంకర్, ఐసీటీసీ కౌన్సిలర్ సుజాత, అంకుష్, డాక్టర్ యోగేశ్ పుండలిక్, రమేశ్, కొండాల్‌రెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ కార్యాలయాల్లో విజిలెన్స్ సోదాలు

శ్రీరాజలరాజేశ్వర, మల్కపేట్ రిజర్వాయర్ల ఫైళ్ల స్వాధీనం



కంప్యూటర్ల నుంచి డేటా సేకరిస్తున్న విజిలెన్స్ అధికారులు

తిమ్మాపూర్, సెప్టెంబర్ 21 : తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలోని పలు నీటిపారుదల శాఖ కార్యాలయాల్లో విజిలెన్స్ అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. శనివారం ఉదయం ముందుగా ఇరిగేషన్ సర్కిల్-1 కార్యాలయానికి వచ్చిన విజిలెన్స్ అధికారులు శశిధర్, శ్రీనివాస్ కార్యాలయ అధికారులకు శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) రిజర్వాయర్‌కు సంబంధించి కావాల్సిన డాక్యుమెంట్లను సిద్ధంగా ఉంచాలని నోటీస్ అందజేసి, పక్కనే ఉన్న మరో కార్యాలయానికి వెళ్లి కాళేశ్వరం పరిధిలోని లింక్ త్రీ, ప్యాకేజీ-9 పరిధిలోని మల్కపేట రిజర్వాయర్‌కు సంబంధించిన పత్రాలను అడిగారు. మిడ్‌మానేరుకు సంబంధించి ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు ప్రతి ఫైల్‌ను తీసుకున్నారు. అందుబాటులో లేనివాటిని డిప్యూటీ ఎస్ఈ అస్మత్ అలీ కంప్యూటర్ల ద్వారా సేకరించి అందజేశారు. అలాగే, మల్కపేట రిజర్వాయర్‌కు సంబంధించిన ఫైళ్లను సైతం డిప్యూటీ ఎస్ఈ వెంకటయ్య ద్వారా పూర్తిస్థాయిలో సేకరించారు. మిడ్‌మానేరు, మల్కపేట్ రిజర్వాయర్లకు సంబంధించిన అంచనాలు, కాలపరిమితి, పొడిగించిన కాలపరిమితి వివరాలు, టెండర్ ప్రక్రియ, బిల్లుల రికార్డు, చెల్లింపులు, కాంట్రాక్టర్లు, పనిచేసిన అధికారుల వివరాలను విజిలెన్స్ అధికారులు తెలుసుకుని రికార్డు చేసుకున్నారు. అనంతరం పత్రాలను తమ వాహనంలో తీసుకెళ్లారు.

అధ్వానంగా ఇరిగేషన్ భవనం..!

అదొక ప్రాజెక్టు ఉన్నతాధికారులుండే కార్యాలయం. కానీ, లోపలికి వెళ్తే మాత్రం.. పాడుపడ్డ భవంతుల్లా పెచ్చులూడుతున్న గోడలు, పక్కనే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఎల్ఎండీలోని ఇరిగేషన్ సర్కిల్-1 కార్యాలయంలో శ్రీరాజరాజేశ్వర (మిడ్‌మానేరు) ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులు ఉంటారు. ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తారు. అలాంటి భవనంలోకి ఎంటర్ అయితే చాలు.. పేరు పెద్దది, ఊరు దుబ్బ అన్న సామెత గుర్తుకువస్తుంది. కూలిపోయేలా కనిపించే గోడలు, పెచ్చులూడుతున్న స్లాబ్ ప్రమాదకరంగా ఉన్నది. కార్యాలయం పక్కనే చెత్తకుప్పలు ఉన్నాయి. వర్షం పడితే పాదాలు మునిగేంత మట్టంలో నీళ్లు నిలుస్తాయని.. తప్పనిసరి పరిస్థితుల్లో విధులు నిర్వర్తిస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు.



పెచ్చులూడిన గోడలు, పైకప్పు

- తిమ్మాపూర్,సెప్టెంబర్21

విద్యార్థులను అభినందిస్తున్న ఎలగందుల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్

జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపిక

కొత్తపల్లి, సెప్టెంబర్ 21 : హుజూరాబాద్ జడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 23, 24వ తేదీల్లో జరిగే ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని ఎలగందుల మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ హరీశ్ పేర్కొన్నారు. పాఠశాలకు చెందిన ఎస్ హారిక, టీ శ్రీజ, పీ హనీ, జీ లక్ష్మీనివాస్ ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ కే శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఖోఖో పోటీలకు 'అద్విత' విద్యార్థులు

స్థానిక భగత్‌నగర్‌లోని అద్విత ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మాధురి శ్వేత పేర్కొన్నారు. ఇటీవల జరిగిన మండల స్థాయి అర్బన్ పోటీల్లో పాల్గొన్న పీ రిష, కే ప్రణవ్‌సాయి ప్రతిభ చూపి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. వారిని పాఠశాల డైరెక్టర్ సొగాని అనుదీప్, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

తాకట్టు కోసం తెచ్చిన బంగారం చోరీ

చొప్పదండి, సెప్టెంబర్ 21 : బ్యాంకులో తాకట్టు పెట్టుకునేందుకు తెచ్చిన ఆరు తులాల బంగారం చోరీకి గురైంది. చొప్పదండి పట్టణంలోని యూనియన్ బ్యాంక్ వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ అనూష తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన రాధ 6 తులాల బంగారాన్ని తీసుకొని తాకట్టు పెట్టడానికి చొప్పదండి యూనియన్ బ్యాంకుకి మధ్యాహ్నం వచ్చింది. బంగారం ఉన్న కవరును బ్యాంకులో ఆమె కూర్చున్న దగ్గర పెట్టి బయట జిరాక్స్ కోసమని బయటకు వచ్చి, మళ్లీ బ్యాంకుకి వెళ్లి చూడగా తన కవర్లోని ఆరు తులాల బంగారం కనబడలేదు. అందులో రెండు తులాల మువ్వల హారం, మిగితా 5 చైన్లు మొత్తం ఆరు తులాల బంగారం ఉన్నట్లు రాధ తెలిపింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎస్సారెస్పీ భూమి ఆక్రమించిన ఇద్దరిపై కేసు

జమ్మికుంట, సెప్టెంబర్ 21 : ఎస్సారెస్పీ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి అనుమతుల్లేకుండా సీసీ రోడ్డు వేశారని డీఈఈ రాము ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని రామన్నపల్లిలో ఎస్సారెస్పీ ఆధీనంలోగల ఐఆర్-8 ఎల్-డీబీఎం16 ఉప కాలువకు ఇన్‌స్పెక్షన్ పాత్ ఉన్నది. సదరు కాలువ కట్టను రామన్నపల్లికి చెందిన పూరెల్ల రాకేశ్, మేడిపల్లి రవీందర్ ధ్వంసం చేసి, చదును చేశారు. ఎస్సారెస్పీ భూమిలో ఎలాంటి పర్మిషన్ లేకుండా 108 మీటర్ల పొడవు, 4 మీటర్ల వెడల్పు సీసీ రోడ్డు వేశారు. దీంతో ఎస్సారెస్పీ హుజూరాబాద్ డీఈఈ రాము ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులు ప్రదర్శించిన హిందీ మోడల్స్

ఆసిఫ్‌నగర్‌లో నో బ్యాగ్ డే

కొత్తపల్లి, సెప్టెంబర్ 21 : మండలంలోని ఆసిఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నో బ్యాగ్ డే కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ పమేల సత్పతి సూచనల మేరకు విద్యార్థులకు స్ఫూర్తిదాయక చలన చిత్రమైన 'ఇంగ్లిష్ వింగ్లిష్'ను ప్రదర్శించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయిని నాగవేణి హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన హిందీ మోడల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు వాసంతి, రాజేంద్రప్రసాద్, ఏంజెలీన్, హరికృష్ణ శర్మ, శ్రీనివాస్, సంతోష్, శ్వేత పాల్గొన్నారు.